ఓట్లన్నీ జగనన్నకే..

- ఓట్ల పంపకమే లేదు
- హోం మంత్రి తానేటి వనిత
- పర్యటనలు, ఆత్మీయ సమావేశాలు



నల్లజర్లలో ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి వనిత

నల్లజర్ల: మీ ఇంట్లో ఎన్ని ఓట్లుంటే అన్నీ గంపగుత్తగా ఫ్యాన్ గుర్తుకే పడాలి. జగనన్నను సీఎం చేయాలి. అదే ఏకైక లక్ష్యం కావాలి. సగం ఓట్లు ఒకరికి, మరో సగం ఇంకొకరికి వేయవద్దు.. అంటూ నబీపేటలో ప్రజలకు హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం సర్పంచ్ గోతం సత్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి వనిత మాట్లాడుతూ పార్టీని గెలిపించడం కోసం ఐక్యత, క్రమశిక్షణతో కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. ఈసారి ఎన్నికలు 2019 ఎన్నికలంత ఈజీగా ఉండవన్నారు. జగనన్నను అధికారంలో నుంచి దించాలన్న ఏకైక లక్ష్యంతో రకరకాల కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటన్నింటినీ ఎదుర్కోవాలంటే ప్రజలంతా ఐక్యతతో ఉండాలన్నారు. తనను ఆడపడుచులా ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గూడూరి శ్రీనివాసరావును, ఎమ్మెల్యేగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి తొలుత వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, చాదరాశిగుంటలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీటీసీ నాయుడు రామకృష్ణ అధ్యక్షతన మంత్రి స్థానికులతో సమావేశమయ్యారు. అనంతరం పోతినీడుపాలెంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి కరుణాకర్ అధ్యక్షతన గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శ్మశాన స్థలంపై పలువురు యువకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కవులూరులో సర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ గారపాటి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుభద్రపాలెం, చీపురుగూడెంల్లో కూడా ఆత్మీయ సమావేశాలు జరిగాయి. నల్లజర్లలో ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బంక జయలక్ష్మి అప్పారావు, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి వెంకటరత్నం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ద్వారకా తిరుమల ట్రస్టు బోర్డు మెంబరు తొమ్మండ్రు రమేష్, నల్లజర్ల, పోతవరం సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ చేబ్రోలు చినవెంకటేశ్వరావు(కొండ), ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, మద్దిపాటి ప్రసాద్, జేఏసీ కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, గంటా రవికుమార్, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, చేబ్రోలు బాలాజీ, సయ్యద్ మునాఫ్, గోతం కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

23 లక్షల కుటుంబాలకు సొంత ఇల్లు



గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెంలో రిజిస్టరైన ఇంటి పట్టాలను అందజేస్తున్న మంత్రి వనిత

గోపాలపురం: ప్రతి కుటుంబానికి సొంత మనిషిలా పనిచేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. వేళ్లచింతలగూడెంలో ఆదివారం 144 మంది మహిళలకు ఇంటి స్థలం రిజిస్టర్డ్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 23 లక్షల కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంత ఇంటి కలను నిజం చేశారని, ప్రతి ఇంటికీ సొంత మనిషిగా పనిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన రాష్ట్ర బడ్జెట్‌ను జగనన్న ప్రభుత్వంలో కూడా అదే కేటాయించారని, అందులోనే రాష్ట్రాభివృద్ధి చేస్తూ.. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని వివరించారు. గత ప్రభుత్వ పాలకులకు కేటాయించిన బడ్జెట్‌లో నిధులు ఏమయ్యాయని ప్రశ్నించాలని ఆమె సూచించారు. జగనన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల రాష్ట్రం అప్పుల పాలవుతుందని ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరలా మోసపూరిత హామీలతో విపక్ష నేతలు ప్రజల ముందుకు వస్తారని, వారిని నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.కుమార్, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత, ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, పి.అన్సర్‌భాషా, తానింకి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పశివేదల పర్యటన

కొవ్వూరు: పశివేదల గ్రామంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొంటారన్నారు. సాయంత్రం మూడు గంటల నుంచి మళ్లీ పశివేదలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

ముగిసిన ఈదమ్మతల్లి ఉత్సవాలు



ఈదమ్మతల్లి

చాగల్లు: రజకుల ఈలవేల్పు ఈదమ్మ తల్లి ఉత్సవాలు చాగల్లులో ఆదివారంతో ముగిశాయి. గురువారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు నాలుగు రోజులు పాటు వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆందోళన

- కందుల దుర్గేష్‌కు నిడదవోలు టికెట్ ఇస్తున్నారంటూ కార్యకర్తల నిరసన
- అధిష్టానం నుంచి సమాచారం లేదన్న శేషారావు

నిడదవోలు: టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు నిడదవోలు టికెట్ కేటాయించారనే సమాచారంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో ఉన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్దకు వారు భారీగా తరలి వచ్చి, నిరసన వ్యక్తం చేశారు. శేషారావుకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శేషారావు వారిని సముదాయించి, మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్‌లో టికెట్ కోసం జరుగుతున్న సంఘటన నేపథ్యంలో బయట వ్యక్తులు నిడదవోలు టికెట్ కందుల దుర్గేష్‌కు కేటాయించినట్టు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నచ్చజెప్పారు. టీడీపీ అధిష్టానం నుంచి ఎటువంటి సమాచారం లేదని, ప్రసారమాధ్యమాల్లో వస్తున్నవి ప్రకటనలు మాత్రమేనని కొట్టిపారేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి పొత్తులో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ గెలుపు గుర్రాలకే టిక్కెట్లు కేటాయిస్తున్నారని స్పష్టం చేశారు. నిడదవోలు టికెట్ దుర్గేష్‌కు ఇస్తున్నారనడం కరెక్ట్ అని తాను అనుకోవడం లేదన్నారు. టీడీపీ అధినాయకుడు, కార్యకర్తలకు చెడు జరిగే ఏ పనికీ తలవంచనన్నారు.

మంచి చేశాం.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- కోరుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



కోరుపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లక్ష్యం కంటే అధికంగా మంచి చేశాం, సంక్షేమ పథకాలను అర్హులకు అందించాం, మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. నిడదవోలు మండలం కోరుపల్లి గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగరావు, సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలన్నీ ఏకమైనా, ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కోరుపల్లి గ్రామంలో రూ.15.85 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.8.35 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలదరికే చేర్చామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ క్యాలెండర్‌తో పేదలకు మంచి రోజులు వచ్చాయన్నారు. స్థానికులు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరగా, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, గ్రామ అధ్యక్షుడు కారింకి సత్యనారాయణ, పార్టీ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, కారింకి చినరాముడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-2 పరీక్ష



వేగేశ్వరపురం గ్రూప్‌-2 పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు

తాళ్లపూడి: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం గ్రూప్‌–2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. వేగేశ్వరపురంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 740 మంది అభ్యర్థులకు 564 మంది పరీక్ష రాసినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. 76 శాతం హాజరయ్యారని చెప్పారు. అభ్యర్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగు నీరు, కరెంట్ సౌకర్యం, ప్రత్యేక హెల్ప్ డెస్క్, పరీక్ష రాసేవారి మొబైల్ ఫోన్లు భద్రపరిచే రూం తదితర వాటిని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎంపీడీఓ వెంకట రమణ, గోపాలపురం డిప్యూటి తహసీల్దార్ కృష్ణ, ఏఎస్‌ఓ వెంకటేశ్వరరావు పరీక్ష విధులు నిర్వహించారు. తాళ్లపూడి ఎస్సై శ్యాం, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఇళ్ల స్థలాలపై పేదలకు సంపూర్ణ హక్కు

- హోం మంత్రి తానేటి వనిత
- పోతవరంలో 457 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



పోతవరంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి వనిత

నల్లజర్ల: ఏ పనైనా సంపూర్ణంగా చేయడం, అంతిమంగా లబ్ధి అర్హులకు చేరేలా చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ పాలనకు నిదర్శనమని, పేదలందరికీ ఇళ్లు పథకమే అందుకు తార్కాణమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం రాత్రి పోతవరంలో 457 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత మంత్రికి పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మంత్రి వనిత మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రజలను సోమరిపోతులుగా చేస్తున్నారని విమర్శించిన ప్రతిపక్షం వారు కూడా ఇవే పథకాలు అందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మళ్లీ ఇవే పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ప్రజల్ని దగా చేయడానికి కల్లబొల్లి కబుర్లతో ఓట్లు దండుకోవడానికి విపక్ష నేతలు వస్తున్నారని, ఎవరెన్ని అమలు కాని వాగ్దానాలు చేసినా నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి అప్పారావు, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి వెంకటరత్నం, సొసైటీ అధ్యక్షులు రుమంచి రమేష్, నాయకులు పెండ్యాల హరేరామకృష్ణ, పిచ్చుకుల ప్రసాద్, కానూరి ప్రసాద్, గద్దే వెంకటేశ్వరావు, పెండ్యాల వీరరాఘవులు, అబ్బూరి దొరయ్య, దూలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినయ్ మృతి పార్టీకి తీరని లోటు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణ



చంద్రవరంలో వినయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజీవ్‌కృష్ణ, ఇతర నేతలు

చాగల్లు: చంద్రవరం గ్రామ సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి కుమారుడు వినయ్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా, ఎంపీపీ మట్టా వీరాస్వామి, చాగల్లు, నిడదవోలు జెడ్పీటీసీలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, కొయ్యే సూరిబాబు ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వినయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ వినయ్ మృతి వారి కుటుంబంతో పాటు, వైఎస్సార్ సీపీకి తీరని లోటన్నారు. పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు ముళ్లపూడి కాశీ, లకంసాని సూర్యప్రకాశరావు, పిల్లి తిరుమలరావు, కట్టా స్వామి, నల్లా కిషోర్, లకంసాని రామకృష్ణ, మారిశెట్టి సత్తిబాబు, బట్టు రాజు, మద్దిపాటి కొదండరాం, బండి అశోక్‌బాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర సపక్‌తక్రా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చూపిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

దేవరపల్లి/కొవ్వూరు: ఏపీ సపక్ తాక్ర అసోసియేషన్ శని, ఆదివారాల్లో నెల్లూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఏపీ అంతర్ జిల్లాల 26వ జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ప్రతిభ చూపింది. బాలికల జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. సబ్ జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచింది. జిల్లా జట్టులో దేవరపల్లి మండలం చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు నుంచి ముగ్గురు, రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు నుంచి ఇద్దరు, దేవరపల్లి జెడ్పీ హైస్కూలు నుంచి ఇద్దరు, వాదాలకుంట జెడ్పీ హైస్కూలు నుంచి ఒకరు, దొమ్మేరు జెడ్పీ హైస్కూలు నుంచి ముగ్గురు, దేవరపల్లి హర్షవర్ధన స్కూలు నుంచి ఒకరు, దేవరపల్లి డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు, కొవ్వూరు మహిళా కళాశాల నుంచి ఒకరు మొత్తం 20 మంది క్రీడాకారులు జట్టులో పాల్గొన్నట్టు కోచ్ కె.పవన్ కుమార్, పీఈటీ ఏలూరి శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత



అనంతపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో ఆదివారం 1980–81లో చదివిన పూర్వ విద్యార్థులు 45 మంది అక్కడే 43 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు ఇక్కడకు చేరుకుని గతస్మృతులు నెమరువేసుకున్నారు. పాఠశాలకు రూ.20 వేల విలువైన ఇన్వర్టర్‌ను అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దేవరపల్లి: యర్నగూడెం బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1978–79లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. ఆనాటి గురువులను సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు.

ఖండవల్లి అమ్మాయికి బంగారు పతకం



తల్లిదండ్రులతో గోల్డ్ మెడల్ సాధించిన సాయిలక్ష్మి

పెరవలి: ఖండవల్లి గ్రామానికి చెందిన అనుకుల శ్రీనివాస్ కుమార్తె హేమ సాయిలక్ష్మి ఎండీఎస్ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో బంగారు పతకం సాధించింది. మహారాష్ట్రలోని నాగపూర్‌లో మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్స్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి, బంగారు పతకం పొందడంతో, ఆదివారం నాసిక్‌లో అక్కడి గవర్నర్ రమేష్ బైయాష్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం హెడ్ అండ్ నెక్ కేన్సర్లకు సంబంధించిన స్పెషలిస్ట్(అంకాలజిస్ట్) ఫెలోషిప్ కోర్సు వార్ధాలో చేస్తున్నానని తెలిపింది. బంగారు పతకం పొందిన సాయిలక్ష్మికి మండలంలోని ప్రముఖులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చిల్లర నాణేలతో తులా భారం



బాలుడిని చిల్లర నాణేలతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో ఆదివారం ఏలూరుకు చెందిన తోట శ్రీగణేష్, శ్రీరత్నం దంపతుల కుమారుడిని చిల్లర నాణేలు, పటిక బెల్లంతో తులాభారం వేసి, మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, పైడికొండల బుల్లియ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

గోపాలపురం: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై ఆదివారం గోపాలపురంలో కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లాల వారీగా గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు కళాజాత నిర్వాహకుడు ఎం కుమార్ తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ, క్షయ వ్యాధులపై వీధినాటకం ద్వారా ప్రజలకు పాటలు, హాస్య సన్నివేశాల ద్వారా అవగాహన కల్పించారు.

ఆశ్రమానికి ఫ్యాన్ల వితరణ



ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న ఆనంద స్వరూప్

నల్లజర్ల: గొల్లగూడెంలోని ఆశ్రమంలో ఫ్యాన్లు లేక అక్కడి దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన చీపురుగూడెం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ తన మిత్ర బృందం సహకారంతో 12 సీలింగ్ ఫ్యాన్లను ఆదివారం ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావుకు అందజేశారు.ఈ సందర్భంగా ఆనంద్ స్వరూప్ మిత్ర బృందం రాచర్ల సంజన, ప్రణీత, పోలుపాం చిన్నారావు, అందుగుల వెంకటేశ్వరావు, ఉందుర్తి రమణమహర్షి, ముంద్రుశ్వేత, మొప్పర్తి సతీష్, చెల్లు తిరుమల శ్రీనివాస్, సోమిశెట్టి భాస్కరగుప్తాను నిర్వాహకులు కాగిత భాస్కరావు అభినందించారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేటలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న ఆలయంలో అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి 49వ కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి పుష్పయాగోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సహస్ర నామార్చనలు, అభిషేకాలను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

నిడదవోలు : సెంట్రల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మానసిక దివ్యాంగుల పాఠశాల (హృదయాలయం)లో ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్, చెరుకుపల్లి ఫణిశారద, బండి వేణుగోపాలకృష్ణ, బూరుగుపల్లి సత్యనారాయణ, ముళ్లపూడి వెంకట్రావు, ఈదాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

ఉండ్రాజవరం: మండలంలో చివటం గ్రామంలోని తణుకు బైపాస్‌లోని కుదప వెంకట కృష్ణారావు, సీతామహలక్ష్మి కమ్మ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హాజరై, సేవామిత్ర, సేవావజ్ర, సేవా రత్న అవార్డులను వలంటీర్లను అందజేస్తారని చెప్పారు.

సుందరేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన



స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం లక్ష బిల్వార్చన, బాలత్రిపుర సుందరీ అమ్మవారికి శ్రీసూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి, సుందర గణేష్, లక్షపత్రి పూజా కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు, కలిగోట్ల కృష్ణారావు, తెన్నేటి సూర్యనారాయణ మూర్తి, వాడ్రేవు సాయికామరాజు, దేవరకొండ రామలింగ శాస్త్రి, వేమూరి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

చాగల్లు: మెయిన్ బజార్‌లో ఉన్న గోవిందరాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.